నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విజయ్ ఆనంద్, రవిఫుడ్, త్రిషు మెటల్ ఫీడర్ పరిధిలోని సర్వీసింగ్ గల్లీ ఏరియా, కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియా, రవిఫుడ్ గల్లీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. పహేల్ ఫుడ్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.50 గంటల వరకు, అక్షయ్ ఫుడ్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, ఆర్‌ఈసీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు ఆరాంఘర్, ఏకే ఆర్ పెట్రోల్ బంక్, మహాలక్ష్మీ హోటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

గ్రంథాలయం ఏర్పాటుకు వినతి

శాస్త్రిపురం: సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌లలో లక్షకు పైగా జనాభా ఉంటుంది. ఇందలో వేలాది మంది చదువుకునే విద్యార్థులు, పోటీ పరీక్షలు, ఇతర ఉద్యోగాల కోసం చదువుకునే నిరుద్యోగులు ఉన్నారు. అందరికీ ఉపయోగపడే గ్రంథాలయం మాత్రం లేదు. ఈ రెండు డివిజన్‌లలో ప్రభుత్వం స్థలం ఉంది. ఆయా స్థలాల్లో ఏదో ఒక ప్రాంతంలో గ్రంథాలయం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. స్థానికంగా గ్రంథాలయం లేనందున నగరంలోని అఫ్జల్‌గంజ్‌లోని సిటీ గ్రంథాలయానికి వెళ్లాల్సి వస్తోందని ఉద్యోగార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిస్థితిని గుర్తించి స్థానికంగా గ్రంథాలయాన్ని ప్రజలు కోరుతున్నారు.

2 వేల టన్నుల యానిమల్ వేస్టేజ్ తరలింపు


వెంకన్న

చార్మినార్: బక్రీద్ సందర్భంగా ఏర్పడిన యానిమల్ వేస్టేజ్‌ను ఎప్పటికప్పుడు తొలగించడానికి గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు చార్మినార్ జోన్ పరిధిలో ప్రత్యేక ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. శనివారం చార్మినార్‌లో ఆయన చెత్త తరలింపు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇమ్లిబన్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద నుంచి యానిమల్ వేస్టేజ్‌తో కూడిన చెత్తను తరలించామన్నారు. అలాగే బండ్లగూడ, మీరాలం ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తరలించామన్నారు. చార్మినార్ జోన్ పరిధిలో మొత్తం 250 వాహనాలను వినియోగించి 2 వేల టన్నుల చెత్తను తరలించి పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. 300 మంది అదనపు సిబ్బందిని వినియోగించామన్నారు.

ఈటల రాజేందర్‌కు ఆహ్వానం


ఈటలకు ఆహ్వానపత్రం అందజేస్తున్న సాయిబాబాచారి, శ్రీకాంత్‌చారి

గోల్కొండ: బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడతాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ నెల 26న గోల్కొండ బోనాల సందర్భంగా రిసాలబజార్ నుంచి తాము అమ్మవారికి పూజలు కోసం ఊరేగింపు నిర్వహిస్తున్నామని దీనికి రావాలని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాలకు గత ప్రభుత్వం ప్రభుత్వ పండుగగా ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. ప్రజల అభిరుచులకు తగ్గట్లుగా బోనాలు నిర్వహించడంలో గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూర్తిగా విఫలమైయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షులు బి.శ్రీకాంత్, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, మల్లేష్‌చారి, జగదీష్ తదితరులున్నారు.

సీఎం తీరుపై మన్నె గోవర్ధన్‌రెడ్డి ధ్వజం

బంజారాహిల్స్: రేవంత్ రెడ్డి సీఎం కుర్చీలో కూర్చున్నా.. బజారు భాష పోవడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... యాదగిరీశుడి సాక్షిగా ఆలేరు సభలో పాపాలు, శిక్ష అంటూ రేవంత్ నిస్సిగ్గుగా తప్పుడు మాటలు మాట్లాడారని ధ్వజమెత్తారు. దెయ్యాలు అంటూ సీఎం స్థాయి మరిచి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అధికారం చేపట్టి 18 నెలలైనా మాజీ సీఎం కేసీఆర్‌పై ఇంకా ఏడుపెందుకు?, 70 ఏళ్ల వయస్సులో ఉన్న పెద్ద మనిషి కాలుజారి గాయపడితే దూషించడం, దేవుడు శిక్షించాడనడం దుర్మార్గమని అన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వాడవాడలా మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజేంద్రనగర్, శంషాబాద్, మణికొండ, బండ్లగూడ, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం తదితర ప్రాంతాల్లో ఉదయాన్నే ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదులు, ఈద్గాల వద్ద పరస్పరం ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం


శాస్త్రిపురం ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


శాస్త్రిపురంలో శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


అత్తాపూర్‌లో బందోబస్తులో పాల్గొన్న ఏసీపీ శ్రీనివాస్


పుప్పాలగూడలో ముస్లింలు నాయకులు...


నెక్నాంపూర్‌లో...


శంషాబాద్ హమీదుల్లానగర్‌లో...

సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యం

- సొంత డబ్బుతోనే సేవలు కొనసాగిస్తున్నా
- ఎవరితోనూ వసూలు చేయడం లేదు
- సిటిజన్ కౌన్సిల్ సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న సిటిజన్ కౌన్సిల్ నాయకులు

మణికొండ: ప్రజల దైనందిన జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను ది సిటిజన్ కౌన్సిల్ నిర్వహిస్తుందని, అందుకు ఎవరి నుంచి ఎలాంటి డబ్బు వసూలు చేయటం లేదని ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, కోశాధికారి ఎ.లక్ష్మణ్‌రావు అన్నారు. శనివారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన స్వంత సంఘటనలను తమ సంస్థకు అండగట్టి పరువు తీస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. తమ సంస్థ ఎవరి వద్ద నుంచి ఎలాంటి ఆర్థిక సాయం ఆశించటం లేదని, తమ సభ్యులే తలా కొంత వేసుకుని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఓ బిల్డర్ కొందరు కొనుగోలు దారులకు చేసిన మోసంతో వారు అతన్ని డబ్బులు అడిగేందుకు వెళ్తే దాన్ని తమకు అంటగట్టడం భావ్యం కాదన్నారు. మున్సిపాలిటీ పరిధిలోను తమ సంస్థకు చెడ్డ పేరు తెచ్చేలా కొందరు వ్యవహరిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ది సిటిజన్ కౌన్సిల్ మణికొండ సభ్యులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ అభివృద్ధికి ఎంపీ కృషి

గోల్కొండ: షేక్‌పేట్ అభివృద్ధికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ కృషి చేస్తున్నారని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన షేక్‌పేట్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలోని శివాలయం స్లాబ్ పనులను పరిశీలించారు. త్వరలోనే ఈ ఆలయ పనులు పూర్తి అవుతాయన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సి.నర్సింగ్‌రావు, సీహెచ్ మల్లేష్, జి.శివకుమార్ తదితరులు ఆయనను సత్కరించారు.

చేప ప్రసాదం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

చార్మినార్: చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శనివారం దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతానికి బత్తిని కుటుంబసభ్యులు, వారి సన్నిహితులతో పాటు మెట్టు సాయి కుమార్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వారికి బత్తిని గౌరీ శంకర్ గౌడ్ స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే ఉచిత చేప ప్రసాదం పంపిణీ భగవంతుని ఆశీర్వాదంతో సజావుగా కొనసాగాలని కోరుకున్నానన్నారు. ఈ ఏడాది కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు.

నాటక రంగాన్ని కాపాడుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుద్రా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్స్‌ప్రెషన్–3 పేరిట నిర్వహిస్తున్న బహుభాషా జాతీయ థియేటర్ ఫెస్టివల్ శనివారం రవీంద్రభారతిలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..నాటక రంగాన్ని కాపాడుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నాటక సమూహాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. మూడురోజుల పాటు నాటకోత్సవాలు జరుగుతాయన్నారు. తెలంగాణకు చెందిన ఒగ్గుకథ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మటీర్ జొన్నో నాటకాలను ప్రదర్శించారు.

విద్యార్థుల సంఖ్యను మరింత పెంచుతాం


బడిబాటలో కొత్త విద్యార్థులను చేర్చుకున్న హెచ్‌ఎం నిరంజన్

మణికొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాబోయే విద్యాసంవత్సరం మరింత మంది విద్యార్థులను పెంచి ఉత్తమమైన విద్యను అందిస్తామని మణికొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ అన్నారు. శనివారం పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ... ఓ ఐటీ సంస్థ సహకారంతో ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం పూర్తవుతోందన్నారు. దాంతో తరగతులతో పాటు సెక్షన్‌లు పెంచి మరింత ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకుంటామన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని, తల్లితండ్రులు తమ పిల్లలను చేర్పించాలన్నారు. ఈ నెల 12వ తేదీన విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ డ్రస్‌లను అందించేందుకు సిద్ధం చేశామన్నారు. మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, నాయకులు బి.శ్రీరాములు, శ్రవణ్‌కుమార్, గంగాధర్, శివగంగ, ఉపాధ్యాయులు, కొత్త విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ బియ్యం పంపిణీ


రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్‌లై ఖైరతాబాద్ ఏఎస్‌ఓ జ్యోతి

బంజారాహిల్స్: ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ తీరును పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే లక్ష్యంగా ఖైరతాబాద్ సర్కిల్ అసిస్టెంట్ సివిల్ సప్‌లై ఆఫీసర్ జ్యోతి శనివారం పలు చౌక ధరల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, బోరబండ, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని రేషన్ షాపులను సందర్శించి జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడు నెలల నిత్యావసర సరుకులను ఒకేసారి పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. ఆమెతో పాటు సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా అసిస్టెంట్ సివిల్ సప్‌లై ఆఫీసర్ జ్యోతి చౌక దుకాణాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులతో నేరుగా సంభాషించి, వారికి అందాల్సిన నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయో లేదో స్వయంగా ఆరా తీశారు. వారు పొందే సరుకులకు సంబంధించిన బిల్లులను చౌక ధరల దుకాణాల డీలర్ల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్డుదారులకు వారి ఆహార భద్రతా కార్డుల ద్వారా లభించే బియ్యం, గోధుమలు, చక్కెర వంటి నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి కార్డుదారునికి లభించే నిత్యావసర సరుకుల పరిమాణం గురించి పూర్తి అవగాహన కలిగించారు. చౌక ధరల దుకాణాల నుంచి సరుకులు తీసుకున్న ప్రతిసారీ తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని లబ్ధిదారులకు స్పష్టం చేశారు. ఇది పారదర్శకతకు దోహదపడుతుందని, ఏమైనా ఫిర్యాదులు ఉంటే సాక్ష్యంగా ఉంటుందని వివరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎటువంటి అవాంతరాలు లేకుండా సక్రమంగా అందేలా చూడడమేనని జ్యోతి పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలియజేశారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి


మాట్లాడుతున్న ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్–2 ముఖ్య నాయకుల సమావేశాన్ని డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరలోనే బీజేపీ డివిజన్ పూర్తి స్థాయి కమిటీని నియమిస్తామన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీ పదవుల్లో నియమించే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా చర్యలు ప్రారంభం అయ్యాయని ఆయన వెల్లడించారు. కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కె.మల్లేష్‌యాదవ్, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జోగి రవి, అడికె రాజు, వై.నర్సిరెడ్డి, అడికె మహేందర్, వల్లూరి శ్రీనివాస్, జె.ఎం.శ్రీను, గూడూరి అంజి, గొడుగు కొండల్, బల్ల శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.

పీరంచెరువులో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


పీరంచెరువు వద్ద ప్లాస్టిక్, చెత్తను తొలగిస్తున్న స్థానికులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు పరిరక్షణకై అక్కడి జనాలు నడుం బిగించారు. సేవ్ పీరంచెరువు అనే పేరుతో ముందుకు వచ్చి చెరువు చుట్టుపక్కల పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించిన బిల్డింగ్ మెటీరియల్‌ను చెరువులో ఉన్న ప్లాస్టిక్‌ను బయలకు తీసి చెరువును క్లీన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చెరువులోని నీరు పూర్తిగా కలుషితంగా మారి, నీరు రంగు మారిందన్నారు. చెరువు చుట్టు పక్కల ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తదితర వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలలోనే చెత్తను వేయాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేసే వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

పేదలను అన్నివిధాలా ఆదుకుంటాం


ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ స్వరూప

మణికొండ: పేద విద్యార్థుల చదువులు, అనారోగ్యాలు, వివాహాలకు ఆర్థిక సాయంతో పాటు అన్ని విధాలా ఆదుకుంటామని వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ జి.స్వరూప నగేష్‌యాదవ్ అన్నారు. శనివారం గ్రామానికి చెందిన బుడల పెంటయ్య కూతురు వివాహానికి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇస్తే మానసిక సంతృప్తి మిగులుతుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు రాబోయే రోజుల్లోనూ నిర్విరామంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులున్నా పేదలు తమను సంప్రదించాలని వారికి తగిన సాయం చేస్తామని ఆమె వెల్లడించారు. ఇప్పటి వరకు వంద మందికి పైగా ఆర్థికంగా ఆదుకున్నామని తెలిపారు.

విజిటింగ్ వీసాలపై 'గల్ఫ్'కు నిరుద్యోగులు!

అక్రమంగా పంపుతున్న మాజీ హోంగార్డు అరెస్టు

శంషాబాద్: అక్రమ సంపాదనకు మార్గం ఎంచుకున్న ఓ మాజీ హోంగార్డును విజిటింగ్ వీసాలపై ఉపాధి కోసం నిరుద్యోగులను విదేశాలకు పంపుతున్న కేసులో ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ... ఈ నెల 5న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు మస్కట్‌లో ఉపాధి కోసం వెళుతుండగా వారి పత్రాలను పరిశీలించిన శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఇమిగ్రేషన్ అధికారులు వారి వద్ద విజిటింగ్ వీసాలున్నట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పలు ఆసక్తికర విషయాలను తెలుసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన సత్యనారాయణ గతంలో హోంగార్డుగా పనిచేసే వాడు. ఇటీవల ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన అతడు సుందరం అనే వ్యక్తి ద్వారా ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వ్యక్తులను తప్పుడు మార్గాల్లో పంపి డబ్బులు సంపాదించే పనిలో పడ్డారు. ఉపాధి వీసాలకు డబ్బుల ఖర్చుతో పాటు కఠినమైన నిబంధనలు ఉండటంతో వారిని విజిటింగ్ వీసాల్లో విదేశాలకు పంపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురిని పంపిన వారు తాజాగా ఈ కేసుతో విషయం బయటపడటంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు.

పేరిణి నృత్య కళను కాపాడుకోవాలి


చిన్నారులతో మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న పేరిణి నృత్య కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ మణిద్వీప ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి నృత్యంపై నిర్వహించిన 40 రోజుల ఉచిత వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 100 మంది విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేరిణి నృత్యం తెలంగాణతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కోట్ల హన్మంతరావు, అకాడమీ గురువు పేరిణి సందీప్, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ అనురాధదేవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల హత్య కేసు దర్యాప్తునకు ఆరు బృందాలు

- పోలీసులకు సవాలుగా జంట హత్యల కేసు
- సత్వరమే ఛేదించే దిశగా పటిష్ట చర్యలు
- విదేశాల నుంచి వచ్చిన కుమారులు
- పూర్తయిన వృద్ధ దంపతుల అంత్యక్రియలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో వృద్ధ దంపతుల హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రుల హత్య విషయం తెలుసుకున్న ఇద్దరు కుమారులు విదేశాల నుంచి శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. పోలీసులు కుమారులతో పాటు ఇతర బంధువులు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్, డ్రైవర్‌లను వేర్వేరుగా ప్రశ్నించి వివరాలను సేకరించారు. ఆరు బృందాలు ప్రత్యేకంగా డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన ఇద్దరు అనుమానితుల ఫొటోలను కుటుంబ సభ్యులు.. స్థానికులకు చూపించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. సీసీ కెమెరాల ఆధారంగా కాలనీతో పాటు ప్రధాన రహదారులపై వేట ప్రారంభించారు. రెండు వాహనాల్లో వచ్చిన ఇద్దరు నిందితులు వేర్వేరు దారుల గుండా వెళ్లడంతో ఈ ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో పోలీసులు పరిశీలిస్తున్నారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో స్పష్టం చేశారు.

సెల్‌ఫోన్లు స్వాధీనం...

హత్యకు గురైన షేక్ అబ్దుల్లా, రిజ్వానాల సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు గురైన రోజు నుంచి అంతకుముందు ఎవరెవరితో మాట్లాడారనే వాటిపై పరిశీలిస్తున్నారు. కాల్ లిస్టు ఆధారంగా విచారణను ముమ్మరం చేశారు. ఇద్దరి సెల్‌ఫోన్‌లో వచ్చిన ఇన్‌కమింగ్, ఔట్ గోయింగ్‌లపై ప్రత్యేక బృందం దర్యాప్తు ప్రారంభించింది.

పూర్తయిన అంత్యక్రియలు...

ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో షేక్ అబ్దుల్లా, రిజ్వానాల మృతదేహాలకు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను షేక్ అబ్దుల్లా కుమారులకు అప్పగించారు. విదేశాల్లో ఉంటున్న ఇద్దరు కుమారులు హత్య విషయం తెలుసుకొని శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను జన చైతన్య వెంచర్‌లోని నివాసానికి తీసుకొచ్చారు. బంధువు, మిత్రుల సమక్షంలో పక్కనే ఉన్న ముస్లిం శ్మశానవాటికలో అంత్యక్రియలను పూర్తి చేశారు.

తెలిసిన వారి పనేనా?

హత్య చేసింది తెలిసిన వారేనన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇంట్లో నగదు, విలువైన నగలను దోచుకునేందుకు వచ్చిన వారైతే దోచుకొని వెళతారు తప్పా... హత్యకు పాల్పడరు అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇంట్లో నగదు, నగల విషయమై కుమారులను పోలీసులు అడిగినట్లు వారి నుంచి వచ్చిన సమాధానం ఆధారంగా పోలీసులు విచారిస్తున్నారు. బెడ్‌రూమ్‌లో పూర్తిగా ఆస్తికి సంబంధించిన దస్తావేజులే ఉండటంతో ఆస్తులకు సంబంధించిన వివాదాలు ఉన్నాయా..? అనే కోణంలో కుటుంబ సభ్యులను ఆరా తీస్తున్నారు.